క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కె.శ్రీనివాసరావు

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించినట్లు పోలీసులు తెలిపారు. విస్సాకోడేరు గ్రామంలోని టెంపుల్ సెంటర్ వద్ద రాత్రి ఏడు గంటల సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో కె.శ్రీనివాసరావు మృతి చెందాడని, అతడికి సుమారు 55 సంవత్సరాలు ఉంటాయని, స్వగ్రామం వంకాయలపాలెమని, ఆకు కూరలు అమ్ముతుంటాడని తెలిసింది. పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వాసుపత్రికి తరలించామని తెలిపారు.

ఆర్యవైశ్య సంఘ ఎన్నికల్లో లోకల్ అభ్యర్థికే పట్టం

యలమంచిలి: క్షీరపురి ఆర్యవైశ్యులు లోకల్ అభ్యర్థికే పట్టం కట్టారు. గత కొద్ది రోజులుగా పట్టణంలో లోకల్, నాన్ లోకల్ అంటూ వాడీవేడిగా సాగిన ఆర్య వైశ్యుల సంఘం అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. లోకల్ అభ్యర్థి అయిన రేపాక ప్రవీణ్ భాను 405 ఓట్ల మెజారిటీతో ఈ ఎన్నికల్లో గెలుపొందినట్లు ఎన్నికల అధికారులు నాళం బాపిరాజు, కారుమూరి శ్రీరాములు ప్రకటించారు. పోటీ అయిపోయిందని, ఇక నుంచి సంఘస్తులంతా ఒక్కటేనని, అందరినీ కలుపుకొని సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని ప్రవీణ్ భాను ప్రకటించారు.

పసలదీవి దుర్గమ్మ జాతర ప్రారంభం

నరసాపురం రూరల్: మండలంలోని పసలదీవి గ్రామంలో ఉన్న కనకదుర్గమ్మ వారి జాతర మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ప్రధాన రహదారిలోని దుర్గమ్మ, మారమ్మ, అమ్మవార్ల ఆలయాల నుంచి చలిమిడి పానకాలను తీసుకువెళ్లారు. అనంతరం అమ్మవారి ఆలయం వద్ద భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. సోమవారం మధ్యాహ్నం 1 గంటకు అమ్మవారి నిప్పుల గుండాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అనంతరం తీన్‌మార్, డప్పుల నృత్యం, బుట్టబొమ్మలతో జాతర మహోత్సవం ఉంటుందన్నారు.

శ్రీ కామాక్షమ్మకు రజత కవచం అలంకరణ

పెనుమంట్ర: మండలంలోని మార్టేరులో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ఆవరణలోని శ్రీ కామాక్షమ్మ వారికి దాతల సహకారంతో చేయించిన రూ 6.50 లక్షలు విలువైన నూతన రజత కవచాన్ని ఆదివారం అలంకరించారు. మార్టేరు పంచ గ్రామం విశ్వబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కొండవీటి వంశీకృష్ణ వేద పండితులతో ఆలయ ఆవరణలో సంప్రోక్షణ, చండీహోమం, శాంతి కల్యాణం మహోత్సవాలను నిర్వహించారు. 50 మంది భక్తులు దంపతులు సహితంగా చండీ హోమంలో పాల్గొని శాంతి కల్యాణం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పరిసర గ్రామానికి చెందిన భక్తులు పాల్గొన్నారు.

పాలకొల్లులో దాసరి జయంతి వేడుకలు

యలమంచిలి: దర్శకరత్న డాక్టర్ దాసరి నారాయణరావు జయంతి వేడుకలు ఆదివారం ఆయన స్వస్థలం పాలకొల్లులో ఘనంగా నిర్వహించారు. దాసరి నారాయణరావు కాంస్య విగ్రహ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో దాసరి కాంస్య విగ్రహానికి మంత్రి నిమ్మల రామానాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాసరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వంగా నరసింహారావు, యర్రంశెట్టి వెంకటరత్నం, బోనం చినబాబు, జక్కంపూడి కుమార్, చుండూరి శ్రీరంగ నాయుడు, కానూరి ప్రభాకర్, జి బాబు, పెచ్చెట్టి బాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన

నరసాపురం రూరల్: అకాల వర్షం వల్ల రైతుల ఇబ్బందుల నేపథ్యంలో కొప్పర్రు, కె.బేతపూడి గ్రామాల్లో వివిధ దశల్లో ఉన్న ధాన్యాన్ని వ్యవసాయశాఖ ఏడీ అనిల్‌కుమారి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నరసాపురం మండలంలో 6,450 మెట్రిక్ టన్నుల ధాన్యం, మొగల్తూరులో 1,950 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆదివారం నాటికి కల్లాల్లో ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ ఇంకా నరసాపురం మండలంలో సుమారు 3,800 ఎకరాలు, మొగల్తూరు మండలంలో 500 ఎకరాల్లో ఇంకా వరి కోతలు కోయాల్సి ఉందన్నారు. తహసీల్దార్ అయితం సత్యనారాయణ మాట్లాడుతూ లిఖితపూడిలో ఒకటి, కొప్పర్రులో ఒకటి, రుస్తుంబాదలో రెండు ఇళ్లు గాలి వానకు దెబ్బతిన్నాయన్నారు. వీటిలో రెండు రేకుల షెడ్ల ఇళ్లు, మరో రెండు తాటి ఆకుల ఇళ్లు ఉన్నట్లు తెలిపారు. మొగల్తూరు, నరసాపురం మండలాల్లో మరో పది, పదిహేను రోజుల్లో పక్వానికి రానున్న సుమారు 600 ఎకరాల్లోని మామిడి కాయలు నేలరాలాయని తెలిపారు.

అకాల వర్షం.. అతలాకుతలం

- భీభత్సం సృష్టించిన భారీ వర్షం
- నేలకూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- భారీ వర్షంతో స్తంభించిన జనజీవనం


పాలకోడేరు: గరగపర్రులో విరిగిన విద్యుత్ స్తంభం


వీరవాసరం: కల్లాల్లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వీరవాసరం: అకాల వర్షం మండల రైతాంగాన్ని అతలాకుతలం చేసింది. ఆదివారం తెల్లవారుజామున చిన్న చిన్న చినుకులతో మొదలైన వర్షం ఈదురుగాలులు, పిడుగులతో కూడిన భారీ వర్షంగా మారి మండల ప్రజలకు నానా కష్టాలు తీసుకొచ్చింది. భారీగా కురిసిన వర్షంతో రాయకుదురు, మత్స్యపురిపాలెం, కమతాలపల్లి, మత్స్యపురి, వీరవాసరం, మెంటేపూడి, తోలేరు తదితర గ్రామాల్లో వరి కల్లాల్లోని ధాన్యాలు తడిసి ముద్దయ్యాయి. భారీగా కురిసిన వర్షాలకు ఈదురు గాలులకు కప్పిన బరకాలు, గడ్డి ఎగిరి ధాన్యాలు వర్షం బారిన పడ్డాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో సుమారు 15 విద్యుత్ స్తంభాలు, కొబ్బరి చెట్లు సుమారుగా 50కి పైగా కూలిపోయాయి.

ఆక్వాపై తీవ్ర ప్రభావం

ఈదురు గాలులు భారీ వర్షంతో ఆక్వా రంగంపై తీవ్ర ప్రభావం చూపింది. రొయ్యల చెరువుల దగ్గర చెట్లు పడి ఫ్యాన్‌సెట్లు, ఆపాలు పాడైపోయాయి. ఆక్వా రైతాంగానికి విద్యుత్ అంతరాయంతో డీజిల్ ఇంజన్ నడుపుతూ ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. వీరవాసరం శివారు తలతాడు తిప్ప లో గంట గుడాల కోట సత్యనారాయణకు చెందిన గేదె పిడుగుపాటుకు మృతి చెందింది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

వీరవాసరం: మండలంలోని రబీ సీజన్‌కు సంబంధించి 12000 వేల ఎకరాలు పంట వేయగా ఇప్పటి వరకు 10000 ఎకరాల్లో కోతలు కోశారని మండల వ్యవసాయ అధికారి బిన్నిబాబు తెలిపారు. మండలంలో ఆదివారం పలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బిన్నిబాబు మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి 33,400 టన్నుల ధాన్యం టార్గెట్ ఇవ్వగా ఇంత వరకు 23500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. 33400 మెట్రిక్ టన్నుల ధన్యానికి 8,36,000 గోనె సంచులు అవసరముందని ఇప్పటి వరకు 7,92,000 గోనె సంచులను దిగుమతి చేసుకున్నామన్నారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఏవీ రామాంజనేయులు సూచించారు.

భీభత్సం సృష్టించిన భారీ వర్షం

భీమవరం: పట్టణంలో ఆదివారం వర్షం భీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపు, పిడుగులు, భీకర గాలులతో కుంభవృష్టి మాదిరిగా భారీ వర్షం కురవడంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ప్రధాన రహదారులపై భారీ చెట్లు కూలిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. సుమారు 3 గంటలకు పైగా భారీ వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయం కాగా తోపుడుబళ్లు, రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుని జీవనం సాగించే వారు పలు ఇబ్బందులు పడ్డారు.

ఏకాదాటికగా వర్షం

ఆదివారం ఉదయం ఎప్పటి మాదిరిగా ఎండపొడ వచ్చినప్పటికీ 8 గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై కొద్ది సేపు వర్షం పడింది. చినుకులు తగ్గడంతో ఎండ వస్తుందనుకునే సమయంలో భీకర గాలి, కుంభవృష్టిగా భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, పిడుగులతో వర్షం కురిసింది. దాదాపు మూడు గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో పల్లపు ప్రాంతాలు జలమయమై పట్టణాల్లోని పలు వీధుల్లో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

ఈదురుగాలులతో దంచికొట్టిన అకాల వర్షం

ఆకివీడు: మండుటెండల్లో ఒక్క సారిగా ఆదివారం ఉదయం వాతావరణం చల్లబడి, మేఘావృత్తమై క్షణాల్లోనే భారీగా ఈదురుగాలులు, వెనువెంటనే కుండపోత వర్షం కురిసింది. ఆకస్మికంగా వచ్చిన వాతావరణంలోని మార్పులకు ప్రజలు ఆశ్చర్యానికిగురై తేరుకునేలోపే భారీ వర్షం ముంచెత్తింది. వీధులు, రోడ్లు జలమయమయ్యాయి.

ఊపిరి పీల్చుకున్న అన్నదాతలు

భారీ వర్షం,ఈదురు గాలులకు కోతకు వచ్చిన వరి చేలు అక్కడక్కడా నేలకొరిగాయి. పలు గ్రామాల్లో రైతులు రాసులపై ఉంచిన ధాన్యంపై టార్పలిన్‌లు బలంగా కప్పడంతో ఈదురుగాలులకు ఎగరలేదు. అయితే టార్పలిన్ నుండి కురిసిన వాన నీరు రాసుల చుట్టూ చేరి క్రింది భాగంలో రాసులు తడిసినట్లు రైతులు చెబుతున్నారు. రైతులకు భారీ నష్టం వాటిల్లలేదు. ధాన్యం రాశులపై ఉంచాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం త్వరితగతిని కొనుగోలు చేయడం లేదని పలు చోట్ల రైతులు వాపోయారు. మిల్లులకు ధాన్యం చేరి ఉంటే తాము నిర్భయంగా ఉండేవారమని రైతులు తెలిపారు.

అకాల వర్షంతో ఆందోళనలో అన్నదాత

పాలకోడేరు: మొన్నటి వరకు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదై వడగాలువులతో ప్రజలంతా ఉక్కిరి బిక్కిరితో అల్లాడి పోయారు. ఆదివారం ఉదయాన్నే వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు సంభవించి ఈదురు గాలులతో భారీ వర్షం కురవడంతో ఇప్పటికే మండలంలోని చాలా గ్రామాల్లో రబీ సీజన్ కి సంబంధించి కోతలు పూర్తవడంతో యంత్రాల ద్వారా కోసిన ధాన్యాన్ని తేమశాతం ఎక్కువగా ఉండడంతో రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టడంతో అకస్మాత్తుగా వచ్చిన వర్షంతో అన్నదాతలు ఒక్కసారిగా ఉక్కిరి బిక్కిరై ఆందోళనకు గురయ్యారు.

నేలకొరిగిన 60 విద్యుత్ స్తంభాలు

ఆదివారం అకస్మాత్తుగా వచ్చిన గాలివాన భీభత్సం సృష్టించింది. ఉదయం 8 గంటల నుంచి పది గంటల వరకూ వచ్చిన గాలి వాన పాలకోడేరు మండలంలో విలయమే సృష్టించింది. పెద్ద పెద్ద చెట్లు కూలిపోయాయి. మండల వ్యాప్తంగా సుమారు 60 విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేటప్పుడు అవసరమైన ప్రమాణాలు పాటించడం లేదని, అందువల్లనే కొద్దిపాటి వర్షం వచ్చినా స్తంభాలు పడిపోతున్నాయని పలువురు విమర్శిస్తున్నారు.


భీమవరం అర్బన్: బేతపూడిలో ఈదురు గాలులతో నేలకొరిగిన వరి చేలు


భీమవరం అర్బన్: ధాన్యపు రాశిపై గడ్డిని తొలగిస్తున్న రైతులు

నేలకొరిగిన వరి చేలు

భీమవరం అర్బన్: మండలంలోని యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, కొమరాడ, ఎల్‌వీఎన్ పురం, రాయలం, చినఅమిరం, బేతపూడి, తుందుర్రు, వెంప, పెదగరువు తదితర గ్రామాలలో ఆదివారం ఉదయం భారీ వర్షం కురిసింది. బలమైన ఈదురుగాలులతోను, పిడుగుల భారీ శబ్దాలతో వర్షం పడటంతో ప్రజలు భయకంపితులయ్యారు. మండలంలో 7800 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టగా ఇప్పటి వరకు సుమారు 7 వేల ఎకరాల్లో మాసూళ్లు పూర్తయ్యాయని, 800 ఎకరాల్లో మాసూళ్లు మిగిలాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. అంతే కాకుండా సుమారు 2 వేల టన్నుల ధాన్యం పొలాల్లో రాశుల్లో ఉండిపోయిందంటున్నారు. ఈ అకాల వర్షం వలన రైతులు ధాన్యపు రాశుల చుట్టూ అడుగు మేర నాలి తీయకపోవడం, వేసవి కాలంలో వర్షం రాదులే అని కొంతమంది రైతులు ధాన్యపు రాశులపై గడ్డి వేయకుండా టార్పాలిన్ కప్పేయడంతో కొన్ని చోట్ల ధాన్యం తడిసిపోయిందని రైతులు చెబుతున్నారు.


ఆకివీడు: భారీ వర్షానికి టార్పాలిన్లను కప్పిన ధాన్యపు రాశులు


ఆకివీడు: నీట మునిగిన రహదారులు


భీమవరం: హౌసింగ్‌బోర్డుకాలనీలో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు


భీమవరం: రోడ్డుపై కూలిన చెట్టు

స్మారక స్థూపానికి శంకుస్థాపన


స్మారక స్థూపానికి శంకుస్థాపన చేస్తున్న సీపీఐ నేతలు

వీరవాసరం: స్వాతంత్ర్య సమర యోధుడు, సీపీఐ అగ్రనేత యాళ్లబండి పోలిశెట్టి స్మారక స్థూపం పునర్నిర్మాణానికి వీరవాసరం మండలం నౌడూరు సెంటర్‌లో ఆదివారం శంకుస్థాపన చేశారు. గత మార్చిలో రోడ్డు విస్తరణ పనుల్లో పోలిశెట్టి స్మారక స్థూపాన్ని తొలగించడం, దీనిపై పెద్ద ఎత్తున ఆందోళనలు చేసిన అనంతరం స్థూపం పునర్నిర్మాణానికి పంచాయతీ అనుమతించింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ యాళ్లబండి పోలిశెట్టి నాటితరం రాజకీయాల్లో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అలుపెరుగని పోరాటాలు చేశారని, అంటరానితనానికి వ్యతిరేకంగా, పెత్తందారీలకు వ్యతిరేకంగా, డెల్టా ప్రాంతంలో భూపోరాటాల్లో ఎన్నో ఉద్యమాలు నడిపించారని గుర్తు చేశారు. బెనారస్ యూనివర్సిటీలో విద్యనభ్యసించిన యాళ్లబండి బడుగు బలహీన వర్గాలకు అండగా రాజకీయాల్లోకి వచ్చారని, సీపీఐ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శిగా, నౌడూరు సర్పంచ్‌గా, విస్సాకోడేరు సమితి ఉపాధ్యక్షుడిగా ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు డీవీవీఎస్ వర్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెల్లబోయిన రంగారావు, రిటైర్డు ప్రిన్సిపాల్ సంకు మనోరమ, కడలి మృత్యుంజయుడు, లింగం సత్యనారాయణ, కటిక సత్యనారాయణ, మామిడిశెట్టి సత్యనారాయణ, కడలి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరితో ప్రేమగా మెలగాలి


ప్రార్థనలు చేస్తున్న పాస్టర్ సాల్మన్‌రాజు

వీరవాసరం: సమాజంలో ప్రతి ఒక్కరితో ప్రేమగా మెలగాలని దైవ సమాజం చర్చి పాస్టర్ బద్దే సాల్మన్‌రాజు ఉపదేశించారు. రాయకుదురు శివారు వీరవల్లి పాలెం గ్రామంలో ఉన్న దైవ సమాజం చర్చిలో మే నెల మొదటి ఆదివారం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, ప్రేమ విందు కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పాస్టర్ సాల్మన్ రాజు బోధిస్తూ మనిషిని ఎక్కడా సంతృప్తి పరచలేమని ఒక్క భోజనంతోనే చేయొచ్చని అన్నారు. కార్యక్రమంలో సేవకురాలు కృపామణి, రిటైర్డ్ కార్పొరేషన్ బ్యాంక్ క్యాషియర్ బొందా వెంకట్రావు, బద్దే పెడ్రిక్, మేడపాటి శిరీష, ఎం.లక్ష్మీదుర్గ, తిరుపతి రాజు, వెన్నా శివన్నారాయణ (ఇస్సాకు), గుబ్బల శ్రీను, ప్రేమకుమారి, సుజీవ్ షారోను రాణి, జ్యోతి, సుబ్బలక్ష్మి, వెన్నా రిబ్కా, రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు కుంకుమార్చనలు


పెనుగొండ వాసవీ శాంతి థాంనుంచి ప్రారంభమైన వాసవీ జ్యోతి యాత్ర

పెనుగొండ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు సందర్భంగా వాసవీ మాతకు కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధనీ వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వరునికి అభిషేకాలు, నిత్య పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వాసవీ మాత, మహిషాసురమర్ధనీ అమ్మవార్లకు సుహాసినీ పూజలు, కుంకుమార్చనలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాసవీ శాంతి థాం నుంచి వాసవీ జ్యోతి యాత్ర

అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి థాం నుంచి తమిళనాడు భక్తులు ఆదివారం వాసవీ జ్యోతి యాత్ర ప్రారంభించారు. చెన్నైలో 300 సంవత్సరాల పురాతన శ్రీవాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతి వేడుకల సందర్భంగా వాసవీ శాంతి థాం నుంచి జ్యోతి యాత్ర చేస్తున్నారు. చెన్నై వాసవీ ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి పూజలు నిర్వహించి, జ్యోతిని తీసుకుని చెన్నైకు బయలుదేరి వెళ్లారు.

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



కలెక్టరేట్‌లో భగీరథ మహర్షి జయంతి నిర్వహిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): భగీరథుని స్ఫూర్తితో జీవితంలో అనుకున్నది సాధించొచ్చని డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం కలెక్టరేట్‌లోని వశిష్ట సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన భగీరథ మహర్షి జయంతి వేడుకల కార్యక్రమంలో భగీరథ మహర్షి చిత్రపటానికి డీఆర్‌ఓ మొగిలి వెంకటేశ్వర్లు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తపస్సుతో గంగను దివి నుంచి భువికి దించిన భగీరథుడు మహా తపస్వి అన్నారు. పట్టుదలకు మారుపేరుగా నిలిచారని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తే జీవితంలో ఏదైనా సాధించొచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.వెంకటేశ్వరరావు, బీసీ సంక్షేమ శాఖ వసతి గృహం అధికారి సీహెచ్ మోహన్‌రావు, కడలి శ్రీనివాస్, కేఎస్ డి.ప్రసాద్, బి.లక్ష్మి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

గంగను భూమ్మీదకి తీసుకొచ్చిన మహనీయుడు భగీరథుడు

ఉండి: గంగను భూమి మీదకు తీసుకొచ్చి భూమిని సస్యశ్యామలం చేసిన మహనీయుడు భగీరథుడని పాములపర్రు మాజీ సర్పంచ్ తాటిపట్టి పెద్ద వీరప్ప అన్నారు. మండల పరిధిలోని పాములపర్రు గ్రామంలో సగర సంఘం ఆధ్వర్యంలో భగీరథ జయంతి ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. భగీరథ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పెద వీరప్ప మాట్లాడుతూ భూమి మీద యావత్ జీవ కోటికి జీవనాధారమైన నీరును తీసుకొచ్చిన వ్యక్తి భగీరథుడని కొనియాడారు. మాజీ వార్డ్ మెంబర్, సగర పెద్ద నక్క వెంకటేశ్వరరావు (వెంకప్ప) మాట్లాడుతూ భగీరథ జయంతిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, సగరులు వాడవాడలా ఘనంగా నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. సగర సంఘం కమిటీ నిర్వాహకుడు, సంఘ పెద్ద నక్క బాల కోటేశ్వరరావు మాట్లాడుతూ పురాణాల్లో ఘన చరిత్ర ఉన్న సగరులకు నేటి పాలకపక్షాలు గుర్తింపునివ్వకపోవటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తాటిపట్టి చిన్న వీరప్ప, కటారి శ్రీను, గండికోట వీరప్ప, కటారి ఏసు, గజ్జల రాముడు, ఏసు, లక్ష్మణుడు, తాటిపట్టి నాగేశ్వరరావు, నక్క పిచ్చియ్య, తాటిపర్తి వీరాస్వామి, గజ్జల ప్రసాదు, దోనాద్రి శ్రీను, నక్క వెంకటేశ్వర్లు, కటారి గోవిందు పాల్గొన్నారు.

వైభవంగా తెప్పోత్సవం


తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పట్టణంలో కోవెలగా సుపరిచితమైన శ్రీ ఆదికేశవ ఎంబెరుమానార్ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు, తిరునక్షత్ర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి తెప్పోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయానికి ఎదురుగా ఉన్న పుష్కరిణిలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హంసవాహన తెప్పపై శ్రీ ఆదికేశవస్వామి, మళ్వాల మహాముని, రామానుజాచార్యుల ఉత్సవ విగ్రహాలను ఉంచి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. జై శ్రీమన్నారాయణ, జై రామానుజ అంటూ నినాదాలతో ఆ ప్రాంగణమంతా మారుమోగింది. ఉత్సవాల ముగింపు వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో అఖండ అన్న సమారాధనను నిర్వహించనున్నట్లు ఈఓ తెలిపారు.

కోకోనట్ మర్చంట్స్ అధ్యక్షుడిగా కఠారి

యలమంచిలి: ఉభయ గోదావరి జిల్లాల్లో వరి పంట తరువాత అధిక పంట కొబ్బరి పంటే అని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం స్థానిక కోకోనట్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో నూతనంగా ఎంపికైన అధ్యక్ష కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కొబ్బరి పంట విశిష్టతను తెలిపారు. సంఘ నూతన అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన కఠారి నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో సంఘ సభ్యులు గెలిపించారని వారి నమ్మకాన్ని నిలబెట్టాలా పని చేస్తానన్నారు. కార్యక్రమంలో కార్యదర్శిగా మాటూరి రామ్‌కుమార్, కోశాధికారిగా దేవరపు శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా మాటూరి వీర వెంకట నరసింహమూర్తి, ఉపాధ్యక్షులుగా చివటపు నాగేశ్వరరావు, కుందురు వెంకట్రామయ్య, లంకలపల్లి సత్య రమేష్, సహాయ కార్యదర్శిగా కొండేటి శ్రీనివాస్ తదితరులు ప్రమాణస్వీకారం చేశారు. చాంబర్ అధ్యక్షుడు కారుమూరి నరసింహరావు, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.

నేడు నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

నరసాపురం: నరసాపురం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్‌హాల్‌లో ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకరమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. వేసవి మంచినీటి సరఫరా అత్యవసర అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఆమోదం కోసం సమావేశం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.